క్లుప్తంగా

కారుణ్య నియామకాలు చేపట్టాలి



పాశర్లపూడిలంకలో నాగరాజు కుటుంబాన్ని పరామర్శిస్తున్న జేఏసీ నేతలు

మామిడికుదురు: ప్రభుత్వ విధులు నిర్వహిస్తూ చనిపోయిన ఉద్యోగులకు వెంటనే కారుణ్య నియామకాలు చేపట్టాలని అమరావతి జేఏసీ నేత టీవీ ఫనిపేర్రాజు డిమాండ్ చేశారు. విధులు నిర్వహిస్తూ చనిపోయిన పాశర్లపూడి లంకకు చెందిన ఆర్టీసీ ఉద్యోగి రాయుడు నాగరాజు కుటుంబాన్ని ఆయన సోమవారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగి చనిపోయి మూడేళ్లు కావస్తున్నా ఇంత వరకు కారుణ్య నియామకం చేపట్టకపోవడం బాధాకరమన్నారు. దీనిపై ప్రభుత్వం తక్షణం స్పందించాలన్నారు. కార్యక్రమంలో చైర్మన్ శ్రీనివాస్, కార్యదర్శి చిరంజీవి, జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్ నాగలక్ష్మమ్మ, డీవీ శేఖర్, ఎం ఎస్ఆర్ మూర్తి, భూషణం, ఎం.ఏసునాయన, పీవీ రమణ, సత్తిబాబు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం



దాత కుటుంబానికి స్వామి చిత్రపటం అందజేస్తున్న ఈఓ నాగ వరప్రసాద్

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు తాళ్లరేవు మండలం సుంకరపాలానికి చెందిన దుర్గపు వెంకటేశ్వర్లు స్మారకార్థం అతని సతీమణి దుర్గపు వీరభద్రం వారి కుటుంబ సభ్యులు సోమవారం రూ.10,116 విరాళం అందించారు. ఏటా మాఘమాసం బహుళ ఏకాదశి రోజున అన్నదానం జరిపించాలని కోరుతూ ఈ విరాళాన్ని ఆలయ ఈఓ ఎంకేటీ నాగవరప్రసాద్, ట్రస్టీ గూటం శ్రీనుకు అందించారు. విరాళం అందించిన దాతకు ఈఓ స్వామి వారి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రహదారి అభివృద్ధి పనుల పరిశీలన



వాడ్రేవుపల్లి వై.జంక్షన్ వద్ద రహదారి అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: రహదారుల అభివృద్ధి పనులను నాణ్యతతో నిర్వహించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. వాడ్రేవుపల్లి వై.జంక్షన్ నుంచి చాకలిపాలెం సెంటర్ వరకూ జరుగుతున్న రహదారి అభివృద్ధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు పలు సూచనలిచ్చారు. మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



మూలస్థాన అగ్రహారంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఆలమూరు: మండలంలోని మూలస్థాన అగ్రహారంలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం జరిగింది. రాజమహేంద్రవరానికి చెందిన ఇందూ జ్ఞానవేదిక అధ్యక్షుడు శేఖర్‌బాబు ఆధ్వర్యాన త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఈ ప్రచారాన్ని నిర్వహించింది. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత, త్రిమత ఏకైక గురువు శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రజలకు వివరించారు. త్రైత సిద్ధాంత గ్రంథాలపై ప్రధానమైన ఆత్మ, పరమాత్మ, జీవాత్మ ఆవశ్యకతను వివరించారు.

స్పందనను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట: ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే స్పందనను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఐ.రత్నంరాజు, తహసీల్దార్ టి.మంగతాయారులు అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు అధికారులు వచ్చి పరిష్కరిస్తారన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన స్పందనకు మండలంలోని అధికారులు హాజరయ్యారు.

భూ వివాదాలకు ముకుతాడు

ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్ మ్యాప్ ద్వారా సర్వే

అంబాజీపేట: మానవుల మనుగడకు భూమి ఎంతో అవసరం. నివాసం ఉండటానికి, పంటలు పండించడానికి, జీవనం సాగించడానికి అత్యంత ముఖ్యం. ఈ నేపథ్యంలో కొన్ని చోట్ల భూమి ఆక్రమణలకు గురవుతోంది. దాని కోసం అనేక రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో రైతులందరికీ వారి భూమిపై హక్కు కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొంది. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకంలో భాగంగా కొన్ని గ్రామాల్లో డ్రోన్ సర్వేలను పూర్తి చేసింది. మరి కొన్ని గ్రామాల్లో డ్రోన్ సర్వేలు కొనసాగుతుంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా భూ వివాదాలు దాదాపు పరిష్కారమవుతాయి. కొత్తపేట డివిజన్ పరిధిలో 2.083 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గ పరిధిలోని మొత్తం భూమి ఉంది. ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్ (ఓఆర్ఐ)మ్యాప్ ద్వారా క్షేత్ర స్థాయిలో భూ సర్వేను నిర్వహించారు. పైలట్ ప్రాజెక్టుగా జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షను ఆలమూరు మండలం కలవచర్లను ఎంపిక చేసుకుని భూ హక్కు పత్రాలతో పాటు, సరిహద్దు రాళ్లను అందించారు. అంబాజీపేట మండలంలో ముక్కామలలో 1027 పసుపల్లిలో 1819, ఆలమూరు మండలం బడుగువానివాలంకలో 3282, మడికిలో 3,185, చొప్పెల్ల 3545, నర్సిపూడి 2,394, మోదుకుర్రు 1432, గుమ్మిలేరు 741, పెనికేరు 1764, ఆలమూరు 2962, పెదపళ్ల 1326, పినపళ్ల 2001, చింతలూరు 2468 భూహక్కు పత్రాలతో పాటు సరిహద్దు రాళ్లను పంపిణీ చేశారు. ఇప్పటి వరకు 50 శాతం సరిహద్దు రాళ్లను నాటారు. రావులపాలెం మండలంలో కొమరాజులంక, ఈతకోట, వెదిరేశ్వరం, ముమ్మిడివరప్పాడు, లక్ష్మీపోలవరం, కొత్తపేట మండలం అవిడి, కండ్రిగ తదితర గ్రామాలు వివిధ దశల్లో సర్వేల్లో ఉన్నాయన్నారు. భూ వివాదాల పరిష్కారానికి ఈ భూ సర్వే ఉపకరిస్తుంది. దీంతో పాటు, పంట పొలాలు, తోటలు ఉన్నాయి. అలాగే ఇళ్ల సర్వే చేయాలి. సుమారు 100 ఏళ్ల క్రితం బ్రిటిష్ సమయంలో భూ సర్వే జరిగింది. నాటి నుంచి నేటి వరకు సర్వే నిర్వహించలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం చేపట్టడంతో భూ హక్కుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భూ తగాదాలు, న్యాయస్థానాల్లో వివాదాల్లో ఉన్న భూములకు విముక్తి లభించనుంది. కోర్టు వివాదాల కారణంగా ఖాళీగా ఉన్న పొలాలు సాగుకు నోచుకుంటున్నాయి. పంట విస్తీర్ణం పెరుగుతుంది. అలాగే సరిహద్దుల తగాదాలు దాదాపు పరిష్కారమవుతున్నాయి.



పసుపల్లిలో నాటుతున్న సర్వే రాళ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ మంగతాయారు

భూ యజమానులు సహకరించాలి



నిర్దేశిత లక్ష్యాల మేరకు సకాలంలో రీ సర్వేను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భూ రీ సర్వేకు రైతులు, భూ యజమానులు సహకరించి సరిహద్దులను చూసుకోవాలన్నారు. సరిహద్దుల సక్రమంగా ఉంటే సంబంధిత యజమానులకు ల్యాండ్ పార్శిల్ నెంబర్ (ఎల్.పి.నెం)ను ఇస్తామని, రాళ్లు పాతుకోవాలన్నారు.

– ఎం.ముక్కంటి, ఆర్డీవో, కొత్తపేట

సీఎం జగన్ ముందుచూపు



ముఖ్యమంత్రి జగనన్న ముందుచూపుతో వ్యవహరిస్తున్నారు. భూ వివాదాలకు చెక్ పెడుతున్నారు. భవిష్యత్తులో సమస్యలు ఉత్పన్నం కాకుండా రీసర్వే చేపట్టారు. దాదాపు బ్రిటిష్ హయాంలో 100 ఏళ్ల క్రితం ఇలా సర్వే చేశారు. ఇప్పుడు జగనన్న ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

– బండారు మల్లిబాబు, ముక్కామల

హనుమాన్‌కి వెండి కవచం సమర్పణ



హనుమాన్‌కి అలంకరించిన వెండి కవచం

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం శివారు ముషిణివారిపాలెంలో వేంచేసి యున్న హనుమాన్ దేవస్థానంలో ఉన్న స్వామికి వెండి కవచాన్ని సోమవారం సమర్పించారు. రాయుడు భూశంకరరావు కుమారుడు గిరీష్‌రావు–సుభాంగిని దంపతులు హనుమంతునికి పూజా విగ్రహానికి వెండి కవచాన్ని సమర్పించారు. అంతకు ముందు స్వామికి, వెండి కవచానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో హనుమాన్ యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు రూరల్ మండలం నడిపూడికి చెందిన అరిగెల వెంకట సుబ్బారావు రూ.10,116 విరాళం సమకూర్చారు. ఈ మొత్తాన్ని ఆలయ చైర్‌పర్సన్‌కు అందించారు.

గ్రామ శాఖల సమాఖ్య అధ్యక్షుడిగా బుజ్జిబాబు

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ గ్రామ శాఖల సమాఖ్య అధ్యక్షుడిగా పాశర్లపూడి గ్రామశాఖ అధ్యక్షుడు చిక్కం బుజ్జిబాబు ఎన్నికయ్యారు. పాశర్లపూడిలో జరిగిన గ్రామ శాఖ అధ్యక్షుల సమావేశంలో సమాఖ్య అధ్యక్షుడిగా బుజ్జిబాబును ఎన్నుకున్నారు. సమాఖ్య అధ్యక్షుడిగా ఎన్నికైన బుజ్జిబాబును సోమవారం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సత్కరించారు. బుజ్జిబాబుకు ఎమ్మెల్యే పూలమాల వేసి శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్న తీరును పార్టీ శ్రేణులు ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాజకీయ లబ్ధి కోసం ప్రతిపక్ష పార్టీలు చేసే విమర్శలను సమర్థవంతంగా తిప్పి కొట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, పార్టీ నేతలు జక్కంపూడి వాసు, తోరం సూర్యభాస్కర్, గెడ్డం వెంకటేశ్వరరావు, మొల్లేటి త్రిమూర్తులు, యూవీవీ సత్యనారాయణ, బాలం రమేష్, కడలి శ్రీను, పాలమూరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



సమాఖ్య అధ్యక్షుడు బుజ్జిబాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

దాతల సహకారం అభినందనీయం

అంబాజీపేట: ఆలయ నిర్మాణానికి దాతల సహకారం అభినందనీయమని పలువురు భక్తులు పేర్కొన్నారు. మాచవరం శివారు పార్వతీ రాజేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మైపాల తాతాజీ, పద్మావతి దంపతులతో నూతనంగా నిర్మిస్తున్న ముఖమండపం, గోపురం, ప్రహరిగోడకు సోమవారం భూమి పూజ చేశారు. ఇప్పటికే తాతాజీ దంపతులు ఆలయ అభివృద్ధికి సంబంధించి రూ.3.11 లక్షలతో ఆలయ ప్రాంగణంలో టైల్స్ వేయించారు. అంతకు ముందు స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

నాడు చంద్రబాబు టోకరా.. నేడు జగనన్న ఆసరా

ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: నాడు టీడీపీ ప్రభుత్వంలో డ్వాక్రా రుణ మాఫీ చేస్తానని చెప్పిన మాజీ సీఎం చంద్రబాబునాయుడు మహిళలను నిట్టనిలువునా మోసం చేస్తే.. నేటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. డ్వాక్రా రుణమాఫీకి సంబంధించిన 'వైఎస్సార్ ఆసరా' మూడో విడత పంపిణీ కార్యక్రమం సోమవారం స్థానిక మండల పరిషత్ ఆవరణలోని శ్రీకృష్ణదేవరాయ సభా ప్రాంగణంలో నిర్వహించారు. ఎంపీపీ మార్గన గంగాధరరావు అధ్యక్షతన జరిగిన సభలో ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఏ రాష్ట్రంలో లేని విధంగా ఈ రాష్ట్రంలో మహిళలకు సీఎం జగన్ ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నారన్నారు. 2019 ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం సుమారు రూ.25 వేల కోట్ల రుణమాఫీకి సంబంధించి ఇప్పటి వరకూ మూడు విడతల్లో సుమారు రూ.19 వేల కోట్లు తిరిగి మహిళల ఖాతాలకు జమ చేశారన్నారు. అత్యధికంగా 6,297 డ్వాక్రా సంఘాలకు రూ.54.77 కోట్లు రుణ మాఫీతో జిల్లా వ్యాప్తంగా కొత్తపేట నియోజకవర్గం ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఇది ఎంతో గర్వకారణమన్నారు. వివిధ సాంకేతిక కారణాల వలన మిగిలిపోయిన పెండింగ్ గ్రూపులకు కూడా లబ్ధి చేకూర్చే అంశాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన వెంటనే సానుకూలంగా స్పందించి అదనంగా రూ.44 కోట్లు మంజూరు చేశారని, ఆ పెండింగ్ గ్రూపుల ఖాతాలకు 15 రోజుల్లో జమ అవుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో మీరంతా జగన్‌కు అండగా నిలవాలన్నారు. అనంతరం 1,672 డ్వాక్రా గ్రూపులకు సంబంధించి రూ.15.85 కోట్ల నమూనా చెక్కును జగ్గిరెడ్డి మహిళలకు అందజేశారు. ముందుగా ఆ ప్రాంగణం ముఖద్వారం నుంచీ జగ్గిరెడ్డిపై డ్వాక్రా మహిళలు పూలవర్షం కురిపించి ఘన స్వాగతంతో బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, వైస్ ఎంపీపీ బండారు సత్యమంగతాయారు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, సర్పంచ్‌లు రెడ్డి చంటి, కుడుపూడి రామలక్ష్మి, దూనబోయిన నవదీప, ఎంపీటీసీ సభ్యులు నేలపూడి భీమరాజు, చావలి సుబ్బరాయశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో డ్వాక్రా సంఘాలకు నమూనా చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

సీఎం జగన్‌కు రాష్ట్ర ప్రజల సంపూర్ణ మద్దతు



అయినవిల్లిలో మహిళకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



చింతలపల్లిలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక

- అయినవిల్లి, చింతలపల్లిల్లో గడప గడపకూ..
- పాల్గొన్న ఎమ్మెల్యేలు కొండేటి, రాపాక

అయినవిల్లి: రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా సంపూర్ణ మద్దతునిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. సోమవారం అయినవిల్లి గ్రామంలో గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రజలను కలసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా! లేదా! అని ఆరా తీశారు. ఎమ్మెల్యే చిట్టిబాబుకు మహిళలు అడుగడుగునా హారతులు పట్టి స్వాగతం పలికారు. గ్రామంలో డ్రెయిన్లు, రహదారులు నిర్మించాలన్నారు. చిట్టిబాబు మాట్లాడుతూ జగన్ మూడేళ్ల పాలనలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పాలనతోనే రాష్ట్రం అభివృద్ధి వైపు ప్రయాణం సాగిస్తుందన్నారు. ఎన్ని ఒడుదొడుకులు వచ్చిన ప్రజలకు సంక్షేమ పథకాలు ఆగవన్నారు. ఇచ్చిన మాటకు సీఎం వైఎస్ జగన్ కట్టుబడి ఉంటారన్నారు. మరిన్ని సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుడుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా చిన్నబాబు, నాయకులు నంబూరి వెంకటరమణరాజు, వేటూకూరి వెంకట్రాజు, పినిపే బుజ్జి, గన్నవరపు సాయిప్రసాద్, కనుమూరి సత్యనారాయణరాజు, దామిశెట్టి బుజ్జి, కామన కృష్ణమూర్తి, పంబల గోపి తదితరులు పాల్గొన్నారు.

గడపగడపతో సత్వర పరిష్కారం: ఎమ్మెల్యే రాపాక

రాజోలు: గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహణతో గ్రామాల్లోని కొన్ని సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సోమవారం చింతలపల్లిలో ఎమ్మెల్యే రాపాక గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. చాలా చోట్ల ప్రజలు చిన్న చిన్న సమస్యలతో ఇబ్బందులు పడుతుంటారని, అలాంటి సమస్యలను గుర్తించి సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వర పరిష్కారాన్ని గడపగడపకూ మన ప్రభుత్వంలో అందిస్తున్నామన్నారు. ఆయా కాలనీల్లోకి వెళ్లినప్పుడు, లబ్ధిదారుల ఇల్లు సందర్శించిన సమయంలో అలాంటి సమస్యలకు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుని వెళ్తున్నామన్నారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఎంతో అండగా నిలస్తున్నాయన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్యకుమార్, సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్తేరు రాణి, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, బొక్కా రామకృష్ణ, చింతలపల్లి వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గూడు కల్పించాలని స్పందనలో వినతి

మామిడికుదురు: పాశర్లపూడిలో 216వ నంబర్ జాతీయ రహదారి పక్కన నివాసం ఉంటున్న కుటుంబాలు తమకు గూడు కల్పించాలని కోరుతూ సోమవారం స్పందనలో వినతిపత్రం అందించారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మకు వినతిపత్రం ఇచ్చారు. 216వ నంబర్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తమ ఇళ్లను పూర్తిగా తొలగిస్తామని అధికారులు చెబుతున్నారని వాపోయారు. కొట్టు నాగేశ్వరరావు, గెడ్డం సునీత, కొట్టు అర్జునరావు, జల్లి అబ్బాయి, గెడ్డం సత్యకుమారి ఈ వినతిపత్రం ఇచ్చారు. తమ పూర్వీకుల నుంచి జాతీయ రహదారి పక్కనే ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నామన్నారు. తమకు ఏ విధమైన ఆస్తులు, ఇళ్ల స్థలాలు లేవని వాపోయారు. తమ పరిస్థితిని అర్థం చేసుకుని తమకు గూడు కల్పించి ఆదుకోవాలని అభ్యర్థించారు.

స్పందనకు రెండు దరఖాస్తులు

ఆలమూరు: ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో రెండు దరఖాస్తులు అందాయి. అందులో ఒకటి రెవెన్యూపరమైనది కాగా మరో దరఖాస్తు పంచాయతీరాజ్‌కు సంబంధించిందని ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ పేర్కొన్నారు. అయితే వీడియో కాన్ఫరెన్స్‌కు సంబంధించిన పరికరాలు పనిచేయకపోవడంతో అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తహసీల్దార్ ఐపీ శెట్టి, ఏఓ ఎస్.లక్ష్మీలావణ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్ ప్రమాద బాధితుడికి సాయం

మలికిపురం: ఇటీవల బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమైన కేశనపల్లికి చెందిన బాధితుడు ముత్యాల వెంకటేశ్వరరావుకు దాతలు సోమవారం రూ.80 వేల నగదు సాయం చేశారు. ఎన్నారై లంకలపల్లి రాజు రూ.50 వేలు, హైదరాబాదుకు చెందిన బిల్డర్ ఎస్.గంగరాజు రూ.30 వేలు సమకూర్చారు. హీరో రామ్‌చరణ్ పుట్టిన రోజు పురస్కరించుకుని ఈ మొత్తాన్ని జనసేన మండల అధ్యక్షుడు మల్లిపూడి సత్తిబాబు తదితరులు బాధితుడికి అందజేశారు.

వైఎస్సార్ బీమా సొమ్ము అందజేత

అంబాజీపేట: మాచవరం సచివాలయం–2 పరిధి గణేష్ కాలనీలో ఈ నెల 25న మృతి చెందిన కోసూరి శ్రీనివాసరావు కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయాన్ని సోమవారం అందజేశారు. బీమాలో మంజూరైన రూ.10 వేల నగదును మృతుడి భార్య నాగమణికి ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అందించారు. కార్యక్రమంలో మైలా ఆనందరావు, నాగాబత్తుల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రోగికి ఆర్థిక చేయూత

సఖినేటిపల్లి: మండలంలోని గుడిమూలలో సోమవారం అనారోగ్యంతో చికిత్స పొందుతున్న కొల్లాబత్తుల తాతారావుకు వైద్యం నిమిత్తం కొల్లాబత్తుల కింగ్స్ వరల్డ్ వైడ్ ఫౌండేషన్ రూ.10 వేల ఆర్థిక సాయం పంపిణీ చేసింది. ఈ మేరకు సదరు ప్రతినిధులు ఆయనకు అందజేశారు. కొల్లాబత్తుల అశోక్, తాడి సహదేవ్, కోన ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా హీరో రామ్‌చరణ్ పుట్టినరోజు

అంబాజీపేట: గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ పుట్టిన రోజు వేడుకలను స్థానిక హైస్కూల్ ఎదురుగా, మాచవరంలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మంచాల నోకేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుట్టిన రోజు కేకును కట్ చేసి పలువురు అభిమానులకు పంచారు. కార్యక్రమంలో అభిమానులు, స్థానికులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: స్థానిక పంచాయతీ వద్ద సోమవారం హీరో రామ్‌చరణ్ పుట్టినరోజు వేడుకలు జనసేన పార్టీ, చిరు సేవాసమితి ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు రామ్‌చరణ్ పుట్టినరోజు కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. బొంతు రాజేశ్వరరావు, గుబ్బల ఫణికుమార్, మల్లిపూడి సత్తిబాబు, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, గుండుబోగుల పెదకాపు, తాడి మోహన్‌కుమార్, నామన నాగభూషణం, ఉండపల్లి అంజి, దిరిశాల బాలాజీ పాల్గొన్నారు.

ఔదార్యం చాటుకున్న యువత



కొత్తపేట చినగూళ్లపాలెంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న యువ శెట్టిబలిజ సంఘం సభ్యులు

కొత్తపేట: అనారోగ్య బాధిత కుటుంబాలకు మండల యువ శెట్టిబలిజ సంఘం రూ.20 వేల సాయం అందించి తన ఔదార్యాన్ని చాటుకుంది. స్థానిక చినగూళ్లపాలెం గ్రామానికి చెందిన వాసంశెట్టి గంగాధర్ గత కొంతకాలం నుంచి పేగు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. అతడి చికిత్స నిమిత్తం అధిక ఖర్చు కావడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఆ కుటుంబం గురించి తెలుసుకున్న యువ శెట్టిబలిజ సంఘం సభ్యులు చలించి తమ వంతుగా రూ.10 వేల సాయం సోమవారం సాయంత్రం అందజేశారు. అలాగే మండలంలోని పలివెల గ్రామానికి చెందిన ముషిణి వీవీ సత్యనారాయణ గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఎన్నో ఆస్పత్రులు తిరిగి చికిత్స చేయించారు. ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితులను తెలుసుకుని రూ.10 వేలు సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బొక్కా ప్రసాద్, గౌరవాధ్యక్షుడు యనమదల శ్రీనివాస్, గౌరవ సలహాదారు కొప్పిశెట్టి వాసు, ఖండ్రిగ ఉప సర్పంచ్ కడలి పార్థసారథి, కోశాధికారి మామిడిశెట్టి బాలాజీ, కముజు తాతాజీ, శ్రీను, కార్యవర్గ సభ్యులు కుడుపూడి గణపతి, దూనబోయిన హరినాథ్, మట్టపర్తి అప్పారావు, కేతా శ్రీను, కడలి వెంకటరమణ, దంగేటి సాయి, బొక్కా పల్లంశెట్టి, వాసంశెట్టి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

మామిడికుదురు: మగటపల్లి గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక సర్పంచ్ సూరిశెట్టి లక్ష్మి సోమవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి సూరిశెట్టి బాబి, పంచాయతీ కార్యదర్శి కె.పట్టిలింగం, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మి

ఆకట్టుకున్న లేగ దూడల ప్రదర్శన

తాళ్లరేవు: జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో భాగంగా పోలేకుర్రులో సోమవారం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేశీయ జాతులైన ఒంగోలు, గిర్, సాహివాల్‌తో పాటు విదేశీ జాతి పశువులైన జెర్సీ, హెచ్ఎఫ్ తదితర దూడలను రైతులు ప్రదర్శించారు. ఎంపీపీ రాయుడు సునీత మాట్లాడుతూ పశు సేవలకు 1962 నంబరుతో వాహనాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.బ్రహ్మవేద మాట్లాడుతూ లేగదూడలను పుట్టినప్పటి నుంచి సంరక్షించాలని, పుట్టిన ఏడవ రోజు, 14, 28వ రోజుతోపాటు ప్రతీ ఆరు నెలలకు పాముల మందు వేయాలన్నారు.



ఆకట్టుకున్న పుంగనూరు లేగదూడ